క్లుప్తంగా

భక్తులకు అన్నసమారాధన



భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేస్తున్న దాతలు

పాడేరు రూరల్ (అరకులోయ రూరల్): స్థానిక మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. భక్తుడు చంద్రశేఖర్ అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు. వి.కాంతమ్మ, జె.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు, కమిటీ సభ్యులు వెంకటరమణ, రామకృష్ణ, సతీష్, రాము, రాధాకృష్ణన్ తదితరులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

రగ్గుల పంపిణీ



రగ్గులను పంపిణీ చేస్తున్న దాత సత్యనారాయణ దంపతులు

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ దూరపాలెంలో గిరిజనులకు ఆదివారం రగ్గులను దాత దుమంతి సత్యనారాయణ, కుమారి దంపతులను పంపిణీ చేశారు. శీతాకాలం కావడంతో చలితీవ్రత ఎక్కువగా ఉండడంతో తమ వంతు సాయంగా పేద గిరిజనులకు రగ్గులు అందజేసినట్టు వారు చెప్పారు. పేద గిరిజనులకు సాయం అందించేందుకు ముందుకు రావాలని కోరారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి



ప్రచారం చేస్తున్న హిందు ధర్మకర్తలు

పాడేరు రూరల్(అరకులోయ రూరల్)/జిమాడుగుల: హైందవ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ కార్య నిర్వాహక సభ్యుడు పి.రామయ్య తెలిపారు. మండలంలో సొలభంతో పాటు వివిధ గ్రామల్లో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు అందరూ తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హిందు ధర్మ ప్రచారకులు మత్యరాజు, అప్పలరాజు, వెంకటరమణ, ఎస్ఎస్ఎఫ్ జిల్లా మహిళ కన్వీనర్ లక్ష్మి, సభ్యులు బాలరాజు, సత్యవతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన మంచు



రాజవొమ్మంగిలో కురుస్తున్న మంచు

రాజవొమ్మంగి: ఇటీవల ఏజెన్సీలోని వాతావరణంలో మంచు ప్రభావం ఎక్కువగా ఉంది. సాయంత్రం 4 గంటల నుంచే చల్లని గాలులు వీస్తున్నాయి. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. రాత్రి 8గంటల నుంచి మంచు విపరీతంగా కురుస్తోంది. బయటకొచ్చేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 9గంటలు దాటినా మంచుతెరలు వీడడం లేదు. దీంతో రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు భయపడుతున్నారు. మండలంలో ఆదివారం మంచు దట్టంగా కురిసింది. చలికి మంచు తోడు కావడంతో దైనందిన కార్యక్రమాలకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు. దట్టంగా కురిసిన మంచుకు పరిసరాలు తడిసి ముద్ద అయ్యాయి.

మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించారు. ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో శ్రమజీవులు పనులకు వెళ్లలేకపోయారు.



నిరుపయోగంగా అరకులోయ తహసీల్దార్ క్వార్టర్



డుంబ్రిగుడ పీహెచ్‌సీ సమీపంలో శిథిలావస్థలో భవనాలు

మోక్షమెన్నడో?

- అరకులోయలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన తహసీల్దార్ క్వార్టర్
- డుంబ్రిగుడ మండలం కిల్లోగుడలో శిథిలావస్థలో ఆరోగ్య కేంద్రాలు
- ఎప్పుడు కూలుతాయోనని భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు

అరకులోయటౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలోని తహసీల్దార్ క్వార్టర్ నిరుపయోగంగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గతకొన్నేళ్లుగా ఈ క్వార్టర్‌లో ఎవరూ నివాసం ఉండడం లేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. ఈ క్వార్టర్‌ను సుమారు 30 సెంట్లు పైగా విస్తీర్ణంలో నిర్మించారు. అరకులోయలో భూములకు విపరీతంగా ధరలు పెరిగిపోవడంతో ప్రభుత్వ స్థలం కనబడితే చాలు కబ్జా జరుగుతుంది. ఇప్పటికే కొన్ని ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయి. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న తహసీల్దార్ కార్యలయం ఎదుట ఉన్న ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న ఈ క్వార్టర్ కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. వినియోగంలో లేని ఈ భవనం అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా మారిందంటున్నారు. ఈ క్వార్టర్ నిరుపయోగంగా మారడంతో గత కొన్నేళ్లుగా ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ అందరూ ప్రైవేట్ నివాస గృహాలు అద్దెకు తీసుకుని ఉండేవారు. మరికొంతమంది మైదాన ప్రాంతం నుంచి రాకపోకలు సాగించేవారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ క్వార్టర్‌తో పాటు సిబ్బంది క్వార్టర్స్‌ను బాగుచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా భవనాలు

డుంబ్రిగుడ: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న రెండు భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఎందుకు పనికి రాకుండా ఉన్నాయి. గతంలో 1990–2005 మధ్య కాలంలో పాఠశాలను నిర్వహించేవారు అయితే ఆ భవనాలు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. భవనాలు చుట్టూ తుప్పలు పెరిగి అధ్వానంగా మారాయి. ఎప్పుడు కూలుతాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అదే విధంగా కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలో రెండు పర్లాంగుల దూరంలో కొర్రాయి పంచాయతీకి చెందిన ఆరోగ్య ఉప కేంద్ర భవనము నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకొని నిరుపయోగంగా మారింది. కిల్లోగుడలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా అక్కడే ఆరోగ్య ఉప కేంద్ర భవనం ఉంది. సమీపంలోని శరత్‌నగర్‌లో మరో ఆరోగ్య ఉప కేంద్ర ఉండడంతో రెండు ఉప కేంద్రాలు మధ్య కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నాయి. ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. గుంటసీమ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల కోసం 1985–90 మధ్య కాలంలో నిర్మాణాలు చేసినా క్వార్టర్స్ భవనాలు పూర్తిగా పాడయ్యాయి. తలుపులు, కిటికీలు లేకుండా శిథిలదశలో ఉన్నాయి. దీంతో ఆ పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవ్వరు స్థానికంగా ఉండడం లేదు. అరకులోయ, పాడేరు, డుంబ్రిగుడలలో నివాసం ఉంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాడైన భవనాలకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



కిల్లోగుడలోని నిరుపయోగంగా సబ్‌సెంటర్



తలుపులు ఊడిపోయి, కిటికీలు, పైకప్పు దెబ్బతిన్న సబ్‌సెంటర్ భవనం



గుంటసీమలో శిథిలావస్థలో ఆశ్రమ పాఠశాల క్వార్టర్స్

ప్రతిపాదనలు పంపాం

అరకులోయలోని తహసీల్దార్ క్వార్టర్‌తో పాటు పాడైన ఇతర శాఖల అధికారులు, సిబ్బంది నివాస గృహాల మరమ్మతుల కోసం యంత్రాంగానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రెవెన్యూ అధికారుల నివాస గృహాలు బాగు చేయిస్తాం.

– ఎం.వి.వి.ప్రసాద్, తహసీల్దార్, అరకులోయ

సంతల్లోని తూకాల్లో మోసాలు

అరకులోయటౌన్: ఏజెన్సీలోని వారపు సంతల్లోని తూకాల్లో మోసాలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సుంకరమెట్ట వారపు సంతను వారు ఆదివారం సందర్శించారు. దుకాణాల్లో కాటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు బుజ్జిబాబు, జోషి తదితరులు మాట్లాడుతూ అమాయక గిరిజన రైతులను ఆసరా చేసుకొని, మైదాన ప్రాంత వ్యాపారుల్లో అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు సంబంధించి తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. దీంతో పాటు వ్యాపారులంతా సిండికేట్‌గా మారి గిరిజన రైతులు సంతల్లో విక్రయించేందుకు తీసుకొచ్చిన అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు కనీసం గిట్టుబాటు ధరలు కల్పించకుండా తీవ్ర నష్టం చేస్తున్నారన్నారు. గిరిజన రైతులను అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు చేసి గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. వారపు సంతల్లో నకిలీ వస్తువులను అరికట్టాలని, లేని పక్షంలో గిరిజన సంఘం తరపున పోరాటాలు సాగిస్తామన్నారు. నాయకులు ఉమామహేశ్వరరావు, రామారావు, సత్యారావు, కృష్ణ, జయరాం, రవి తదితరులు పాల్గొన్నారు.



వారపు సంతలో వ్యవసాయ ఉత్పత్తుల తూకాన్ని పరిశీలిస్తున్న ఏపీజీఎస్ నాయకులు

రహదారి పనులకు శంకుస్థాపన



రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చిన్నబాబు తదితరులు

అరకులోయటౌన్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ దండబాడు రహదారి జంక్షన్ నుంచి లింబగుడ వరకు రహదారి నిర్మాణానికి సర్పంచ్ గెమ్మెలి చినబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చినబాబు మాట్లాడుతూ రెండు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. ఈ రహదారి పూర్తయితే అరకులోయ, హుకుంపేట మండలవాసులకు ఎంతో ఉపయోగకరమన్నారు. రాజు, కేశవరావు, బాబూరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

పరదేశిపాకలలో తాగునీటి సమస్య

- మూలకు చేరిన సోలార్ పథకం
- ఆరునెలలుగా నిలిచిన నీటి సరఫరా
- గ్రామస్తుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

కొయ్యూరు: మండలంలోని బంగారంపేట పంచాయతీ పరదేశిపాకలలో తాగునీటి సమస్య వేధిస్తోంది. గ్రామంలోని సోలార్ ప్యానల్ పాడై పనిచేయకపోవడంతో నీటి సరఫరా జరగడం లేదు. గ్రామానికి ఈ సోలార్ పథకం ద్వారానే తాగునీరు సరఫరా అవుతుందని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో సోలార్ పథకం మూలకు చేరడంతో ఆరు నెలలుగా నీటి సరఫరా జరగడం లేదంటున్నారు. కాలినడకన సుదూర ప్రాంతానికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో కోట్లాది రూపాయలతో తాగునీటి పథకాలు ఏర్పాటయ్యాయని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పైపులైన్‌లు, తాగునీటి పథకాలు అధ్వానంగా మారుతున్నాయంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని విన్నవిస్తున్నారు.



పాడైన సోలార్ పథకం

కలుషిత నీరే శరణ్యం

ఈ సమస్యపై రావణాపల్లి ఎంపీటీసీ సభ్యురాలు ఇరువాత సత్యవేణి, సీపీఐ నేత దేముడు ఆదివారం విలేకరులతో పరదేశిపాకల గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామరన్నారు. గత్యంతరం లేక గ్రామస్తులు కలుషిత నీటిని వినియోగించి రోగాల బారిపడుతున్నారని చెప్పారు. సమస్యను అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పరదేశిపాకలలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



జీసీసీ పెట్రోలు బంకు ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

చింతపల్లి: గిరిజన సహకార సంస్థ ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అమర్ అన్నారు. చింతపల్లి జీసీసీ పెట్రోలు బంకు వద్ద ఉద్యోగుల సమస్యలపై ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీరికి సెలవులు ఉండక పోగా రోజుకు 12గంటల పాటు పనిచేయిస్తున్నారన్నారు. వీటన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా పెట్రోలు బంకుల ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం అధ్యక్షుడు శివశంకర్, సీపీఐ నాయకులు సత్తిబాబు, ఏఐటీయూసీ నాయకులు లోవరాజు, మత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కార్మికులకు తీరని నష్టం

ముంచంగిపుట్టు: మైదాన ప్రాంత భవన నిర్మాణ కార్మికులు గిరిజన ప్రాంతానికి అధికంగా వచ్చి పనులు చేయడం వల్ల గిరిజన భవన నిర్మాణ కార్మికులంతా తీవ్రంగా నష్టపోతున్నామని మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు పాత్రో రవికుమార్ అన్నారు.మండల కేంద్రంలో గిరిజన భవన నిర్మాణ కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు పాత్రో రవికుమార్ మాట్లాడుతూ డిగ్రీలు, పీజీల వరకు చదువుకొని భవన నిర్మాణాలే జీవనంగా గిరిజన మేస్త్రీలు జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మైదాన ప్రాంతాల నుంచి అధికంగా భవన నిర్మాణ కార్మికులు గిరిజన ప్రాంతానికి రావడం వల్ల నిర్మాణ పనులు కోల్పోతున్నామన్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని, పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జరిగే భవన నిర్మాణ పనులను గిరిజన భవన నిర్మాణ కార్మికుల చేత జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో గిరిజన భవన నిర్మాణ పేద కార్మికులకు చేతినిండా పని దొరుకుతుందన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు నర్సింగ్, కార్యదర్శి కొములు, జాయింట్ కార్యదర్శి శరత్ కుమార్, కోశాధికారి ప్రమోద్‌కుమార్, సభ్యులు రాము, జగన్నాథం, నాగరాజు, జయరాం, సాధురాం, భగిరథీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు రవికుమార్

విచ్చలవిడిగా సారా తయారీ

జి.మాడుగుల: మండలంలో సారా తయారీ, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దీని ప్రభావం సమీప గ్రామాలపై పడుతోంది. మండలంలోని వంజరి పంచాయతీ కిముడుపల్లిలో కొంతకాలంగా విచ్చలవిడిగా సారా తయారీ సాగుతోంది. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో తయారీదారులు డ్రమ్ముల్లో పులుపు ఊటను నిల్వ చేసి, సారా తయారు చేస్తున్నారు. తయారు చేసిన సారాను ప్యాకెట్లలో సీల్ చేసి అమ్మకాలు చేపడుతున్నారు. వివిధ రసాయనాలు, ఇతర హానికర పదార్థాలతో తయారు చేసిన సారాతో వ్యాపారులు గిరిజనుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. అమాయక గిరిజనులు సారాను తాగి అనారోగ్యానికి గురవడంతో పాటు కొన్నిసార్లు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో గుట్టుగా సాగుతున్న సారాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



డ్రమ్‌ల్లో సారా పులుపు



సారా ప్యాకెట్లు



సారా తయారీ

గ్రామాల్లో కనకదుర్గమ్మ ప్రచార రథం పర్యటన



బలిజపాడులో కనకదుర్గ అమ్మవారి రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



జడ్డంగిలో అమ్మవారి ప్రచారరథం

రాజవొమ్మంగి: ఏపీ దేవదాయ, ధర్మాదాయ శాఖ ఏర్పాటు చేసిన హిందూ ధర్మ ప్రచార రథం ఆదివారం రాజవొమ్మంగి మండలంలోకి వచ్చింది. విజయవాడలోని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచి వచ్చిన కనకదుర్గమ్మ అమ్మవారి రథం ప్రస్తుతం మండలంలోని బలిజపాడు, జి.కొత్తపల్లి, వంచంగి తదితర గ్రామాల్లో పర్యటించింది. ఈ రథం రాత్రికి జడ్డంగి చేరుకుంది. సోమవారం ఉదయం 7 గంటలకు రాజవొమ్మంగిలోని షిర్డీసాయిబాబా ఆలయం వద్ద 10 నిమిషాలు నిలుపుతారని భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకు పూజలు చేయవచ్చని పురోహితుడు మురళి తెలిపారు. అమ్మవారి కుంకుమ ప్రసాదం అందజేస్తామన్నారు. అనంతరం రథం కృష్ణాదేవిపేట మీదుగా పాడేరు చేరుతుందన్నారు.

అందుబాటులోకి పర్యాటక బోటు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలోని గిరిజన మ్యూజియంలో పాడైన బోటును మ్యూజియం అధికారులు బాగు చేయించారు. ఇటీవల గిరిజన మ్యూజియంలో నూతన బోటును పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రారంభించారు. అయితే బోటులో నెలకొన్న సాంకేతిక కారణాలను సరిచేసి మరలా ఆదివారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చినట్టు మ్యూజియం క్యూరేటర్ మురళీకృష్ణ తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన బోటును వెంటనే బాగు చేయించినట్టు ఆయన చెప్పారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన బోటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మ్యూజియంలో నూతన బోటులో విహరిస్తున్న పర్యాటకులు

వర్షంతో రైతుల్లో గుబులు



వరి కుప్పలపై వేసి ఉన్న టార్పాలిన్లు



కిలగాడ గ్రామంలో వరి కుప్పలపై కప్పి ఉన్న టార్పాలిన్లు

డుంబ్రిగుడ: గతవారం మన్యంలో తుపాను కారణంగా విస్తర వర్షాలు కురిసాయి. అయితే ఈ వారం కాస్త ఎండాలు రావడంతో రైతులు సంతోషించారు వరి నూర్పులు చేసుకొవచ్చని ఎంతో ఆశ పడ్డారు. అయితే ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశంలో దట్టంగా మేఘాలు కమ్ముకున్నాయి. వర్షం పడుతుండటంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కల్లాల్లో వరి కుప్పలకు టార్పాలిన్లు కప్పి నూర్పిళ్లను మానుకున్నారు. ఈ వారం కూడా వర్షాలు పడితే వరి పంటలతో పాటు ఇతర కూరగాయల పంటలు పూర్తిగా పాడైపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో ఆదివారం పలుచోట్ల చిరుజల్లులు పడగా మరికొన్ని చోట్ల ఆకాశమంతా మేగామృతమై కారుమబ్బులు ఉండడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలో పలుచోట్ల వరి కోతలు మొదలవడం వరి కుప్పలుగా పోసి ఉన్నాయి. చిరుజల్లులతో గిరిజన రైతులు వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పి వర్షానికి పంట పాడవకుండా శ్రమిస్తున్నారు. మరికొన్ని చోట్ల కోత కోసిన వరి, సామలు, రాగులు పంటలు పొలాల్లో ఉండటం రైతులు ఆందోళన చెందుతున్నారు. గిరిజన ప్రాంతం అంతటా చెదురుముదురు వర్షాలు పడుతుండటం ఆకాశంలో కారుమబ్బులు కన్పిస్తుండటం గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వర్షపు జల్లులతో గిరిజన రైతులు పంటను కాపాడుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు.

సేవతోనే సంపూర్ణ ఆనందం

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని తాడిగుడ గ్రామస్తులకు అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడారు. తాడిగుడ గ్రామంలోని 35 గిరిజన కుటుంబాలకు అందించామన్నారు. ఏజెన్సీలో గిరిజనులు చలి నుంచి రక్షణ పొందేందుకు ఏటా తమ సంస్థ తరపున రగ్గులు చేస్తున్నామన్నారు. సేవతోనే సంపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సూరెడ్డి బాబురావు మాస్టారు మాట్లాడుతూ గిరిజనులకు విద్య, వైద్యం, ఇతర అవసరాలు తీర్చేందుకు తమ సంస్థ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. దొగ్గ ఎరుకునాయుడు మాస్టారు మాట్లాడుతూ గ్రామంలోని విద్యార్థుల చదువుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ట్రస్టు సిద్ధంగా ఉందన్నారు. ట్రస్టు సభ్యురాలు మల్లేశ్వరి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, సారా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అచ్చిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీలకు రగ్గులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

మన్యం వాతావరణం.. విభిన్నం



డుంబ్రిగుడలో ఉదయం కురుస్తున్న మంచు

- ఉదయం మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వర్షం



డుంబ్రిగుడలో సాయంత్రం కురుస్తున్న వర్షంలో గొడుగుల సాయంతో వెళ్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ: మన్యంలో ఇటీవల విభిన్న వాతావరణం అలుముకుంటుంది. మంచు, ఎండ, వానతో మూడు కాలాలు దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఉదయం మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వర్షంతో మూడు కాలాలతో ఇక్కడ వచ్చిన పర్యాటకులు, గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. మంచులో పర్యాటకులు రోడ్డులో, పర్యాటక ప్రదేశాలలో సంతోషంగా గడిపితే, మధ్యాహ్నం ఎండా కాస్తుందని సంతోషించి వరి నూర్పులు చేసుకునేందుకు సిద్ధమైన రైతులకు మాత్రం సాయంత్రం వర్షాంతో దిగులు మొదలైంది. మన్యంలో ఎప్పుడు ఏకాలం ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది.